క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్, ప్రింటర్లను అందజేస్తున్న దాతలు

మాకవరపాలెం: జంగాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను దాతలు బుధవారం వితరణగా అందించారు. గ్రామానికి చెందిన సింగంపల్లి సత్యనారాయణ, రాయి అర్జున్ చెరో రూ.20 వేల చొప్పున వెచ్చించి వీటిని సమకూర్చారు. అనంతరం విద్యార్థులతో సామూహిక విద్యాభ్యాసాలు చేయించారు. దాతలను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జాన్‌ప్రసాద్, మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశీపురంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



సీతారాములను దర్శించుకుంటున్న ఈర్లె అనురాధ, భాస్కరరావు, బాబూరావు

దేవరాపల్లి: కాశీపురం రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సీతారాములవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, ఉగ్రాకుల అప్పారావు, వాలేటి నాగరాజు, బండారు దేముడునాయుడు, దాసరి మంగునాయుడు, చలుమూరి చంద్రమోహన్, ఆదిరెడ్డి వెంకటరావు, అక్కునాయుడు తదితర్లు దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. మధ్యాహ్నం ఇక్కడ భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆర్లిలో సీతారాముల తీర్థం



సీతారాములకు పూజలు చేస్తున్న సర్పంచ్ సందీప్, తదితరులు

కె.కోటపాడు: ఆర్లిలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి సీతారాములవారికి పూజలు చేశారు. సర్పంచ్ బోళెం సందీప్, మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, తదితరులు పూజల్లో పాల్గొన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సరస్వతీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు చేస్తున్న విద్యార్థినులు, ప్రిన్సిపాల్

కె.కోటపాడు: సరస్వతీదేవి జన్మదినం సందర్భంగా బుధవారం కింతాడ కేజీబీవీలో వసంత పంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ సరస్వతీదేవి విగ్రహం వద్ద విద్యార్థినులు ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విజ్ఞానాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎంపీడీవో ఆగ్రహం

నాతవరం: సచివాలయాల సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలని, లేకుంటే చర్యలు ఉంటాయని ఎంపీడీవో జాగర్ల రాంబాబు తెలిపారు. బుధవారం యర్రవరం, నాతవరం గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సంతకాలు సక్రమంగా పెట్టకపోవడం, వలంటీరు హాజరుపట్టికలో సంతకాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మార్పు రాకుంటే నోటీసులు ఇవ్వాలని ఈవోపీఆర్డీ ఎస్.వి.మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనులను ఆదేశించారు.



నీటి పథకానికి అమర్చిన 12.5 హార్స్‌పవర్ గల రెండు బాహుబలి మోటార్లు



ధర్మవరం వద్ద సర్పానది ఒడ్డున భారీ మంచినీటి పథకం



పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

కొత్తకోటకు సమృద్ధిగా తాగునీరు

- 30 ఏళ్ల తాగునీటి కష్టాలకు చెక్
- రూ.7.66 కోట్లతో పూర్తి కావచ్చిన భారీ మంచినీటి పథకం
- వేసవిలోనూ నీటికి ఢోకా లేదు
- త్వరలో ప్రారంభించనున్న విప్ ధర్మశ్రీ



గ్రామంలోని ఒక బావి వద్ద తాగునీటికి మహిళల అవస్థలు



గ్రామంలో పూర్తికావచ్చిన పైపులైన్ పనులు

రావికమతం: చోడవరం తర్వాత అతిపెద్ద మేజరు పంచాయతీ కొత్తకోటలో తాగునీటి కష్టాలకు త్వరలోనే చెక్ పడనుంది. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చొరవతో ఆ గ్రామానికి జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.7.66 కోట్లు మంజూరు చేయించడంతో ధర్మవరం వద్ద భారీ తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి గామంలోని అన్ని ట్యాంకులకు పైపులైన్‌లను అనుసంధానించారు. వారం రోజుల్లో ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

20 వేల జనాభా – ఎక్కడ చూసినా ఉప్పునీరు..

కొత్తకోటలో 20 వేల జనాభా ఉంది. ఇక్కడ 16 వార్డుల్లోనూ తగినన్ని చేతి బోర్లున్నప్పటికీ ఉప్పునీరే వస్తోంది. గ్రామంలో ఎక్కడ బోరు వేసినా ఇదే పరిస్థితి. దీంతో తాగునీటికి ఇబ్బందులే ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో 35 ఏళ్ల క్రితం రెండు లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఆ నీరు ఏమాత్రం చాలకపోవడంతో మరొక రెండు ట్యాంకులు నిర్మించారు. అయినా తాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు. రెండు రోజులకొక సారి కుళాయి నీరు ఇస్తుంటారు. వేసవిలోనైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిందే. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద మంచినీటి బావి వద్ద మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడి బిందెలతో నీటిని తీసుకువెళ్లే దుస్థితి కూడా ఉంది.

జలజీవన్ మిషన్‌లో భారీగా నిధులు:

ఈ నేపథ్యంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చోడవరం నియోజకవర్గానికి రూ.121కోట్లు మంజూరు చేయించారు. దీనిలో కొత్తకోటకు రూ.7.66 కోట్ల కేటాయించడంతో ధర్మవరం వద్ద సర్పానది ఒడ్డున భారీ పథకాన్ని ఏర్పాటు చేసి భారీ మోటార్లను అమర్చారు. అక్కడి నుంచి గ్రామానికి పెద్ద పైపులైన్‌లు ద్వారా తీసుకు వచ్చి నీటి పథకాలకు అనుసంధానం చేశారు. ఇంటింటికీ కుళాయిలను వేశారు. జగనన్న కాలనీకి పైపులైన్ వేసే పనిలో ఉన్నారు.

ఇకపై పుష్కలంగా నీరు



30 ఏళ్లుగా గ్రామంలో కుళాయి నీరు ఐదు నుంచి పది నిమిషాల మాత్రమే ఇస్తున్నారు. ఒక్కో ఇంటికి రెండు మూడు బిందెలు రావడం లేదు. అది కూడా రెండు రోజులకు ఒక సారే ఇస్తున్నారు. ఎత్తయిన గుమ్మడు, వేమవరపు వీధుల్లో నాలుగడుగుల లోతులో కుళాయిలు ఉండటంతో ఆ మాత్రం నీరు రాదు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మించిన పథకం ద్వారా నిర్మించిన 30 అడుగుల బావిలో నీరు సమృద్ధిగా ఉంటోంది. వారం రోజులుగా ట్రయిల్‌రన్ వేస్తున్నాం. వారం రోజుల్లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

– కోన లోవరాజు సర్పంచ్, పందల దేవా ఉప సర్పంచ్

వేడుకగా బేతపూడి కేజీబీవీ వార్షికోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

దేవరాపల్లి: సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి తెలిపారు. స్థానిక ప్రిన్సిపాల్ సిహెచ్. భువన మాధురి అధ్యక్షతన బుధవారం బేతపూడి కేజీబీవీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పరీక్షలు అంటే భయం వీడి, ప్రశాంత వాతావరణంలో రాయాలని టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు సూచించారు. ఎంఈవోలను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి



చమ్మచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాతవరం: పుల్వామా దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయి ఐదేళ్లవుతున్న సందర్భంగా శ్రేయోభిలాషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నానాజీ ఆధ్వర్యంలో బుధవారం చమ్మచింతలో శాంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జగన్, బ్రహ్మాజీ, ఇందు, సృజన, అనూషా, కృప, గ్రామస్తులు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం ఆశయం

వైఎస్సార్ ఆసరా సభలో ఎమ్మెల్యే గణేష్



మహిళలతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే



సభకు భారీగా హాజరైన మహిళలు

మాకవరపాలెం: వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగు విడతలుగా నియోజకవర్గ వ్యాప్తంగా రూ.160 కోట్లు లబ్ధి చేకూరిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగో విడతగా మంజూరైన రూ.9.26 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేశారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం ఆశయమని, దానికనుగుణంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు చెప్పారు. నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకంలో నియోజకవర్గంలో 56 వేల మంది డ్వాక్రా మహిళలకు రూ.160 కోట్లు అందించామన్నారు. మాకవరపాలెం మండలానికే రూ.37 కోట్లు లబ్ధి కలిగిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌కు మహిళలు అండగా నిలబడాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయమంటే 630 పడకల మంజూరు.. ఈ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సీపట్నంలో 150 పడకల ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని కోరానన్నారు. అయితే మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వద్ద ఏకంగా రూ.500 కోట్లతో 630 పడకల వైద్య కళాశాలను మంజూరు చేశారన్నారు. ఈ కళాశాల నిర్మాణం పూర్తయితే వేలాది మందికి మెరుగైన, సత్వర వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాశపు నాయుడు, తహసీల్దార్ మురళీమోహన్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్ లింకన్, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

అవురువాడలో తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారు సత్యనారాయణను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ కోటి

మాడుగుల: నూతన తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన టి. సత్యనారాయణను బుధవారం అవురువాడలో గ్రామ పంచాయతీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కిముడు కోటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తంటపురెడ్డి బన్నీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలతో నెరవేరిన కల

మాకవరపాలెం: జగనన్న కాలనీలతో నిరుపేదలకు సొంతగూటి కల నెరవేరిందని తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. తామరం జగనన్న కాలనీలో గ్రామానికి చెందిన గిడుతూరు సంతోషి, శ్రీను ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు. వీరితో కలిసి హరిబాబు, సర్పంచ్ చెల్లారత్నం బుధవారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీల్లో 95 శాతానికి పైగా అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హామీలిచ్చి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో తామరం ఉప సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తురకలపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శిరీషారాణి



జానకిరాంపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

బుచ్చెయ్యపేట: విద్యార్థులు పోషకాలున్న సమీకృత ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శిరీషారాణి తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చదువుతోపాటు ఆరోగ్యంగా ఉన్నపుడే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు స్థానిక ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు బుదిరెడ్డి నాగ భూషణం, నాయకులు కాసు పాల్గొన్నారు.

క్షయపై ఆందోళన వద్దు

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్, సీహెచ్‌వో ప్రసాద్ తెలిపారు. జానకిరాంపురంలో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయవ్యాధి లక్షణాలు కలిగిన వారు ఆందోళన చెందవద్దని సూచించారు. సాధారణ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మరిడితల్లి కాలనీలో చురుగ్గా అభివృద్ధి పనులు



సీసీ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న మండలాధ్యక్షుడు రామధర్మజ, సర్పంచ్, ఎంపీటీసీ



కాలనీలో మంచినీటి ట్యాంకు నిర్మాణం

మాడుగుల: పట్టణంలోని మరిడితల్లి కాలనీలో వాటరు ట్యాంకు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు బుధవారం సీసీడ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నిల్వలు పేరుకుపోయి కాలనీ వాసులు ఇబ్బందులు పడేవారన్నారు. తాగునీటికి ఇదే పరిస్థితి ఉందన్నారు. గడపగడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇక్కడ సమస్యలు గుర్తించి మంచినీటి పథకంతోపాటు ఇంటింటి కుళాయిలకు రూ.30 లక్షలు, సీసీ డ్రైనేజీలకు రూ.5 లక్షలు, సీసీ రోడ్లకు రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, గుత్తేదారుడు ఎడ్ల హేమంత్ కుమార్, వార్డు మెంబరు కొండాజీ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు



గౌరీపరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపులో భక్తులు

గొలుగొండ: చీడిగుమ్మలలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించి సారె సమర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నబ్బాయి, ఎంపీటీసీ అప్పలనాయుడు, చీడిగుమ్మల సహకార బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

రోలుగుంట: కొమరవోలులో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక రామాలయం వద్ద ఉత్సవ స్థలంలో ఉత్సవమూర్తులను ఉంచారు. భక్తులు, సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోళెం వెంకటలక్ష్మి దంపతులు, ఎంపీటీసీ గొర్లె వెంకటరామన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు ఆధ్వర్యంలో మహిళలు చీర, సారెతో ఉత్సవమూర్తులను సాగనంపి స్థానిక సూరమ్మ చెరువులో నిమజ్జనం చేశారు.

వైభవంగా బాలచెంచమ్మ తల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: ప్రసిద్ధ చెందిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ముందెన్నడూ లేని విధంగా ఈసారి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని ఈ ప్రాంతీయులు కొలుస్తుంటారు. వేకువజాము నుంచీ ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ అర కిలోమీటర్ మేర బారులు తీరారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన చీరెలు, కొబ్బరికాయలు, అరటిగెలలు, చెరకు, ధాన్యం మూటలు, బెల్లపు దిమ్మెలు మొక్కుగా చెల్లించుకున్నారు. రావికమతం, కొత్తకోట ఎస్ఐలు, సిబ్బందితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు బందోబస్తు నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ ఎంతగానో ఆకట్టుకుంది. భారీ జెయింట్‌వీల్, రైలు మార్గం, సర్కస్ వంటివి పిల్లలకు మంచి వినోదాన్ని పంచాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి

రోలుగుంట: విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేసి సత్ఫలితాలు సాధించాలని ఎంఈవో జానుప్రసాద్ ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో పదిలో సత్ఫలితాల సాధన కోసం ఏర్పాటు చేసిన లెర్నింగు ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం టీంతో కలసి బుధవారం ఆయన బుచ్చింపేట హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉపాధ్యాయ సిబ్బంది వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత చెందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్శనలో నోడల్ హెచ్‌ఎం శెట్టి మోహన్, లిప్ బృందం అప్పన రాంబాబు, టి.సత్యన్నారాయణ, శ్రీరామ్మూర్తి, కోటేశ్వరరావు, పీడీ కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు సువార్త మహోత్సవాలు



రమణమ్మను సత్కరిస్తున్న మెసయ్య మినిస్ట్రీస్ సభ్యులు

దేవరాపల్లి: మెసయ్య మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తారువలో క్రీస్తు సువార్త మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వక్త ఈ.వి. టామిహేస్ క్రీస్తూ ప్రేమ సందేశాన్ని అందించారు. ప్రత్యేక ప్రార్థన గీతాలను ఆలపించారు. అనంతరం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మను మినిస్ట్రీస్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిషప్ సాల్మన్‌రాజు బంగారి, పాస్టర్ పి. జాషువా, క్రైస్తవులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును బాధితుడికి అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అందజేశారు. మున్సిపాలిటీ పరిధి 9వ వార్డుకు చెందిన పైడిగంటి వెంకటరవిచంద్ర రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో గడపగడపకు కార్యక్రమంలో ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే గణేష్ సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తం చెక్కును బుధవారం బాధితుడి ఇంటికివెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర కటుంబం ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి

నాతవరం: గ్రామాల్లో ఆలయాలు నిర్మించడం వల్ల ప్రజల్లో భక్తిభావం అలవడుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. చమ్మచింతలో పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం హిందూ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.10 లక్షలతో ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించామన్నారు. పలు ఆలయాలు నిర్మించేందుకు నిధులు కోసం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రతిపాదనలు పంపించారన్నారు. ప్రస్తుతం పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయ నిర్మాణం గ్రామస్తుల విరాళాలతో పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు చేశామన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టరు అప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.